




లింగ వివక్షత లేని సమాజ నిర్మాణమే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు : స్త్రీ పురుషులు ఇరువురూ సమానమే- సమానత్వపు హక్కు పరిరక్షణ మనందరి భాధ్యత అని, సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని లింగ వివక్షత లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎస్‌పి సిహెచ్ విజయరావు పిలుపు నిచ్చారు. బుధవారం నేషనల్ జెండర్ కాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఉమేష్‌చంద్రా కన్వెరెన్స్ హాల్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించగా మహిళా పోలీసులు, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళాపోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు



జగన్ జన్మదిన 'జగడాలు'..!

నాయకులు ఎవరివారే కార్యక్రమాలు - నెల్లూరు,ఉదయగిరిలోఉద్రిక్తత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఆ పార్టీలోని అసమ్మతిని మరోసారి బయటపెట్టింది. నేతలు ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించారు. నెల్లూరు నగరంలో నువ్వా..నేనా అన్నట్లు అనిల్‌కుమార్ యాదవ్, రూపమ్‌కుమార్ యాదవ్ గ్రూపు నేతలు వ్యవహరించారు. ఉదయగిరిలో ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, అయన వ్యతిరేకవర్గం పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహించారు. కొందరు నేతలున్నా పట్టించు కోలేదు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాల విద్యార్థులను పార్టీ కార్యక్ర మాలకు ఉపయోగించుకున్నారు. మరికొన్ని చోట్ల ఆఫీసులకు తాళాలు వేసి మరీ కార్యక్రమం నిర్వహించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చింది. జగన్ జన్మదిన కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాపితంగా ఘనంగా నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆపార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సీజన్ కావడంతో పెద్ద ఎత్తున నిర్వహించారు. విద్యార్థులను బయటకు తీసుకొచ్చి జగన్ మామయ్యకు జన్మది నమంటూ నానా హంగామా చేశారు. జన్మదిన వేడుకలు జరుపుకోవడం తప్పుకాకపోయినా విద్యార్థులను ఇందులో భాగస్వాములుచేసి, వైసిపి కండువాలు కప్పిన పరిస్థితులు కనిపించాయి. విద్యార్థులతో వైసిపి నేతలు ర్యాలీ నిర్వహించారు. ఉదయగిరిలో ఏకంగా విద్యార్థుల చేత డప్పులు వాయించారు. నెల్లూరు నగరంలో ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ గ్రూపు నేతలు వేరుగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనిల్ గ్రూపునకు చెందిన నేతలు రాజీవ్ భవన్‌లో రక్తదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇదే సమయంలో నుడా ఛైర్మన్ ముక్కాలద్వారకా నాథ్, వైఎస్ ఛైర్మన్ రూప్‌కుమార్ యాదవ్ ర్యాలీ నిర్వహించి, గాంధీబొమ్మ వద్ద భారీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేస్తామని చెప్పడంతో పేద మహిళలు పెద్ద ఎత్తున తరలొచ్చారు. ఈకార్యక్రమంలో తొక్కిసలాట జరిగి పలువురు మహిళలు కిందపడిపో యారు. స్వల్పగాయాలయ్యాయి. నగరంలో రెండు గ్రూపుల నేతలు ఎవరికి వారే అన్నట్లు కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా రెండు గంటలు ట్రాఫిక్‌జామ్ కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు ఎంఎల్‌ఎ అనుచరులు, మరో వైపు రూప్‌కుమార్ అనుచరులు కావడంతో పోలీసులు ట్రాఫిక్ విషయంలో ఏమీ చేయలేదు. రెండు గ్రూపుల బలప్రదర్శనకు దిగాయి. జగన్ పుట్టిన రోజు ఇక్కడ ఆపార్టీలోని విభేధాలకు మరింత కారణమైంది. ఇప్పటి వరకు చాపకింద నీరులా సాగుతోన్న వీరి వివాదాలు ఇప్పుడు బయటకొచ్చాయి. ఉదయగిరి నియోజకవర్గంలో నేతలు మరీ రెచ్చిపోయారు. ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి నేత చేజర్ల సుబ్బారెడ్డి, మైనార్టీ నేత అలీ అధ్వర్యంలో మూడు గ్రూపులుగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఫ్లెక్సీలు, మరొకరు చింపేశారు. ఎంఎల్‌ఎ పాల్గొన్న కార్యక్రమంలో వైసిపి ర్యాలీకి విద్యార్థులను సమీకరించారు. ఏకంగా విద్యార్థుల చేత డప్పులు వాయిస్తూ, కార్యక్రమం నిర్వహించారు. జగన్ జన్మదినం సందర్భంగా మూడు గ్రూపుల నేతలు నువ్వా, నేనా అన్నట్లు వ్యవహరించారు. మధ్యలో విద్యార్థులను ఉపయోగించుకోవడంతో తల్లిదండ్రుల్లోనూ ఆగ్రహం వ్యక్తమైంది. మరో మండలంలో ఏకంగా ఎంపిడిఒ కార్యాలానికి తాళాలు వేసి, అక్కడే స్టేజ్‌నిర్మాణం చేసి, రెండు గంటలు విధులకు ఆటంకం కలిగించి కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. జగన్ పుట్టిన రోజు ఘనంగా నిర్వహించి మంచి మార్కులు కొట్టేయాలను ఉన్ననేతలు విబేధాల కారణంగా వైసిపి గొడవలు బజారున పడ్డాయి.







కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

కార్మిక సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక పప్పుల వీధిలోని షాపింగ్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడి లోడింగ్ అండ్ అన్ లోడింగ్ ముఠా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, ఎఐటియూసి జిల్లా నాయకులు షాజహాన్ డిమాండ్ చేశారు. సోమవారం నుంచి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా బుధవారం పప్పుల వీధిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులకు, యాజమా న్యాలకు మధ్య కూలిరేట్ల ఒప్పందం గడువు పూర్తయినా యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలం భిస్తుందన్నారు. విధి లేని పరిస్థితుల్లో కార్మికులకు సమ్మె బాట పట్టారన్నారు. కార్మికులు, యాజమాన్యాలు సంయుక్తంగా రూపొందించుకున్న నిబంధనల మేరకు కార్మికులు అనేక విడతలుగా యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చిన స్పందించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్న కారణంగా సమస్య మరింత జఠిలమవుతోందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే కార్మికులకు సంఘీభావంగా అన్ని కార్మిక సంఘాలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు కత్తి శ్రీనివాసులు, నగర ఆఫీస్ బేరర్స్ పి సుధాకర్, బి రాంబాబు, ఆర్ శ్రీనివాసులు, నాయ కులు పి సూర్యనారాయణ, చిరంజీవి, రషీద్, ఫయాజ్, ఎఐటి యుసి నాయకులు సిరాజ్, నాగేందర్, రోశిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డిఓ రోజ్‌మాండ్ అరెస్టు

జైలుకు తరలింపు - సివిల్ సప్లయ్‌కేసులో అక్రమాలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి



రోజ్‌మాండ్, ఆర్‌డిఓ

సివిల్ సప్లయ్ కేసులో అక్రమాలకు పాల్పడ్డ కేసులో సూళ్లూరుపేట ఆర్‌డిఒ రోజ్‌మాండ్‌ను ఎసిబి అధికారులు బుధవారం అరెస్టు చేశారు.ఆమెకు కోర్టు రిమాండ్ విధించి జైలుకు తరలించారు. నెల్లూరు సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో భారీ అవినీతి జరిగింది. రెండు నెలల నుంచి ఈ కేసు విచారణ సాగుతుంది. జెసి కూర్మానాథ్ ప్రాథమిక విచారణ జరిపి 32మంది రూ.43కోట్లు అవినీతి చేసినట్లు ప్రాథమిక విచారణ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కంప్యూటర్ ఆపరేటర్ శివకుమార్‌తో పాటు ఇప్పటికే 20మందిని ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. నెల రోజులపాటు ఎస్‌పి నేతృత్వంలో విచారణ జరిగింది. అటు తర్వాత ఈ కేసును ఎసిబికి అప్పగించారు. ఎసిబికి అప్పగించినప్పటి నుంచి కేసు వేగవంగా సాగుతుంది. ఎసిబి అధికారులు సుమారు రూ.20కోట్లు విలువైన భవనాలు, భూములు, కార్లు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. తవ్వేకొద్ది అక్రమాలు బయట కొస్తుండడంతో ఈ కేసులో ఎంతమందిని అరెస్టు చేస్తారో తెలియడంలేదు. 2017 నుంచి 2022వరకు పని చేసిన డిఎంలు, అసిస్టెంట్ డిఎంలు, సూపరిం టెండెంట్లతో పాటు అనేక మంది కేసులో ఉన్నారు. తాజాగా విచారణలో పూర్వ సివిల్ సప్లయ్ డిఎం ప్రస్తుత సూళ్లూరుపేట ఆర్‌డిఒ రోజ్‌మాండ్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. బుధవారం సూళ్లూరుపేటలోని తన నివాసంలో ఉండగా ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. అక్కడ నుంచి కోర్టుకు హాజరు పరచగా ఆమెకు కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు జైలుకు తరలించారు. ఈ కేసులో ఆర్‌డిఒ స్థాయి అధికారి అరెస్టు కావడంతో జిల్లాలోని అధికారుల్లో ఆందోళన నెలకొంది. మరింత మందిని అరెస్టు చేసేందుకు ఎసిబి సిద్ధమైంది.

డిఆర్‌డిఎ పీడీకి అభినందనలు

నెల్లూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సమిష్టి కృషి కారణంగానే జాతీయ స్థాయిలో పురస్కారం అందుకోగలి గామని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.వి. సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రముకుల సమక్షంలో పురస్కారాన్ని అందుకొని నగరానికి చేరుకున్న కె.వి.సాంబశివారెడ్డిని బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో సహచర సిబ్బంది ఘనంగా సత్కారిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ అవార్డును డిఆర్‌డిఏలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. పురస్కారం అందుకున్న డిఆర్‌డిఏ పిడి కెవి. సాంబశి వారెడ్డిని సత్కరించారు. డిఆర్‌డిఎ ఆడిషనల్ పీడీ రాజు, డిపే ఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : కాకాణి



పొదలకూరు : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతు న్నామని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బత్తులపల్లిలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరించి, అర్హులందరికీ సక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసు కుంటున్నామని పేర్కొన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నియోజ కవర్గం, బత్తలపల్లి గ్రామ ప్రజల పక్షాన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తు న్నామని తెలిపారు. భారీ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు ,అభి.మాను లకు పంచిపెట్టారు. మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అది కారులు, నాయకులు గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, ఉడతా రమేష్, లచ్చా రెడ్డి, పోల్ రెడ్డి, మద్ది రెడ్డి రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి -వెంకటాచలం : నక్కల కాలువకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి వరద ముంపు నుంచి రైతులను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని అనకాపల్లి గ్రామంలో మానవ స్తూపం కారణంగా మునిగిన పంట పొలాలు, నక్కల కాలువను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి నక్కల కాల్వపూటికి తీసి రైతులను నష్టపోకుండా చూడాలని తెలిపారు సిపిఎం సెక్రెటేరియట్ సభ్యులు గోగుల శ్రీనివాసులు, మండల కన్వీనర్ ఓడూరు వెంకట కష్ణయ్య శాఖ కార్యదర్శి రసూల్, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రోడ్ షో జరిగే ప్రాంతాల్లో పరిశీలన

కందుకూరు : ఈ నెల 28న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కందుకూరు పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రోడ్ షో జరిగే ప్రాంతాలను నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆయన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యాలయ ప్రతినిధులు, పార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి...

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని ఆత్మకూరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం టిడిపి నాయకులు నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు బెల్లం కష్ణమోహన్, సర్పంచ్ నాలం గోవిందమ్మ, నెల్లూరు పార్లమెంట్ తెలుగు రైతు కమిటీ సభ్యులు దామచర్ల సుబ్బారావు, నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మద్దసాని మహేంద్ర, మాజీ సర్పంచ్ అమర్నేని రాములు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దేవినేని హనుమంతరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నెల్లూరు : మినీ బైపాస్ రోడ్డులో ట్రాక్టర్‌ను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ ఈగ వెంకయ్య ను వైద్య చికిత్సల నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందారు. విజమహల్ గేటు సమీపంలో టాక్టర్‌కు కంకర్ ఆన్ లోడ్ చేసి తిరిగి లోడ్ కోసం వెళ్తున్న సమయంలో నేషనల్ హైవేపై సాక్షి కార్యాలయం సమీపంలో విజయవాడ నుండి చెన్నై వైపు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. కారు, ట్రాక్టర్ బోల్తాకొట్టాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన ట్రాక్టర్ డ్రైవర్ ఈగ వెంకయ్య ను వైద్యచికిత్సల నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ తిక్కవరపుపడు గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

పొదుపు మహిళలకు పొట్టేళ్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు జీవనోపాదుల కల్పనలో భాగంగా పొట్టేళ్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివద్ధిసంస్థ (డిఆర్డీఏ) ప్రాజెక్ట్ డైరక్టర్ కెవి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

వైసిపిలో పలువురు చేరిక

ఉలవపాడు : సిఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కరేడు గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలు వైసిపిలో చేరాయి. వీళ్ళని కరేడు గ్రామ నాయకులు నల్లపురెడ్డి అజిత్ కుమార్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొల్లి భాస్కర్, కొల్లి సుబ్బయ్య, సవరం బాలకష్ణ, వాకా సుబ్బారావు, వాకా సురేష్, మక్కే మోషీ, కొల్లూరి వెంకయ్య ఉన్నారు.

పొట్టేపాళెం కలుజుపై వంతెన నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టే పాలెం వద్దనున్న కలుజుపై వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. పొట్టేపాళెం వద్దనున్న కలుజుపై వంతెన నిర్మించాలని కోరుతూ సిపిఎం రూరల్, బుచ్చి మండల కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా రెండో రోజుకు చేరింది. బుధవారం ఈ ధర్నా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పొట్టి పాలెం కలుజుపై స్వర్ణాల చెరువు నుంచి పెన్నా నదిలోకి ప్రమాదకరంగా నీళ్ల ప్రవహిస్తున్నాయన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పొట్టేపాళెం కలుజు ప్రాంతంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మరణించారన్నారు. అనేకమంది గాయపడ్డా రన్నారు. ప్రతి నిత్యం ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారునమన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఈ ప్రాంతంలో హై లెవల్ వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు నాలుగు మండలాల ప్రజలకు సంబంధించిన సమస్యలపై దృష్టిసారించకపోవడం దారుణ మన్నారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన కలుజుపై హై లెవల్ వంత నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరి తిరుపాలు, బుచ్చి మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిపిఎం సీనియర్ నాయకులు పొ ట్టి పాలెం చంద్రమౌళి , సిపిఎం రూరల్ మండల నాయకులు పూడిపర్తి జనార్ధన్, ముత్యాల నాగయ్య, అట్లా అనిల్, ఎస్.కె అబ్దుల్లా, బాలు ఆదిశేషయ్య, పల్లవరపు చెంచయ్య, వి వెంకట రమణయ్య, శ్రీపతి దయాకర్, ఎం పుల్లయ్య, ఎం పెంచలయ్య, సాంబయ్య, బుచ్చి మండలం నాయకులు తంబి రమణయ్య, పోతంశెట్టి శ్రీనివాసులు, వై ప్రభాకర్, కె. వెంకట రమణయ్య, అంకయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

26న 'నాటా' ఆట పాట

డాక్టర్ ప్రేమ సాగర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) ఆధ్వర్యంలో నాటా సేవా డేస్ సందర్భంగా ఈనెల 26న 'నాటా' ఆట పాట కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని నాటా ఆధ్యక్షులు డాక్టర్ కె. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 అమెరికా, ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) ద్వైవార్షిక సంబరాలు వైభవం జరుగుతు న్నాయ న్నారు. డిసెంబర్ 2022 నుంచి తెలంగాణ, ఎపిల లో పలు నగరాల్లో "నాటా సేవా డేస్" ఘనంగా నిర్వహిస్తా మన్నారు. కార్యక్రమం ముగింపు సంద ర్భంగా ఈనెల 26న సాయంత్రం 4 గంటలకు నగరంలోని విపిఆర్ కన్వెక్షన్ సెంటర్‌లో నిర్వహిస్తు న్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతోపాటు, సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామని, సినీ కళాకా రులు, గాయకులతో పాటల సందడి ఉంటుందని తెలిపారు. జిల్లాలో పుట్టి పెరిగిన అమెరికాలో తెలుగు వారందరికి పెద్ద దిక్కుగా ఉండి, అంతర్జాతీయంగా వైద్య, ఆరోగ్య సేవా రంగంలో విశేష గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డికి పౌరసన్మానం ఉంటుం దన్నారు. శ్రీసిటి వ్యవస్థాపకులు రవీంద్రసన్నారెడ్డి మాట్లాడుతూ కరోనా కారణంగా ఇటీవల ఆట, నాట ఉత్సవాలు జిల్లాలో నిర్వహించలేదన్నారు. 2007లో అప్పటి కలెక్టర్ రవిచంద్ర సహకారంతో పెద్ద ఎత్తున ఆట ఉత్సవాలు నిర్వహించామన్నారు. 2014లో తానా ఉత్సవాలు విపిఆర్‌లో ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. సేవా డేస్ సంద ర్భంగా ఉమ్మడి రాష్ట్రాల్లో 41 చోట్ల వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో 21 చోట్ల వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. తెలుగు ప్రజలకు ఉపయోగపడేలా నాటా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 17 మంది సభ్యులుగా నాటాలో ఉన్నాయని తెలిపారు. లాయర్ శివ ప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిడిగుంటపాళెంలో పుట్టిన డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి అమెరికాలో అత్యున్నత స్థాయికి చేరారన్నారు. 10 వేల మంది డాక్టర్లు, 70 వేల మంది సిబ్బంది ఆయస సంస్థలో పనిచేస్తున్నారని, 14 సంవత్సరాల తరువాత నెల్లూరు వస్తున్నా రన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా విశ్వ వైద్య సేవాభూషణ్ బిరుదు ప్రదానం చేస్తామని తెలిపారు. 26వ తేది సాయంత్రం 4.30నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రమేష్‌పాల్గొన్నారు.



ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

వెంకటాచలం : రాష్ట్ర చరిత్రలో సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిండు నూరేళ్ల సంపూర్ణ ఆయురారోగ్యాలతో రాష్ట్రానికి శాశ్వత ముఖ్య మంత్రిగా ఉండాలని కాంక్షిస్తుననట్లు వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చెముడుగుంటలోని శ్రీడ్స్ ఫంక్షన్ హాలులో రెడ్ క్రాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. భారీ కేక్ కట్ చేవారు. రెడ్ క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు కుంచ రమేష్ , కోడూరు కల్పలత, మాజీ జెడ్పిటిసి మందల వెంకట శేషయ్య పాల్గొన్నారు. కసుమూరు గ్రామ పంచాయతీలో గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్డినేటర్ షేక్. బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్. అల్లి బాషా మాట్లాడారు. **'విఎస్‌యు'లో..** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను విఎస్‌యులో ఘనంగా నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించి మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినోత్సవని పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 50 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభిం చడంతోపాటుగా నెల్లూరు రెడ్ క్రాస్ వారి సౌజన్యంతో అనుబంధ కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్ల సహకారంతో దాదాపుగా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. రిజిస్ట్రార్ డా పి.రామచంద్ర రెడ్డి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయ నంద్ కుమార్ బాబు, ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డా ఉదయ శంకర్ , ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కె.సునీత డా కె వి .విద్యప్రభాకర్, ఆచార్య సుజా ఎస్ నాయర్,డా బి వి సుబ్బా రెడ్డి, డా టి.వీరారెడ్డి పాల్గొన్నారు.



వెంకటాచలంలో..



కందుకూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి 50వ జన్మదిన వేడుకలను ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లను కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి అందజేశారు. వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

లింగసముద్రం : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదినోత్సవ వేడుకలను లింగసముద్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు.పెదపవని సచివాలయం వద్ద జడ్‌పిటిసి డాక్టర్ చెన్ను నళినిపద్మ, డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకల్లో ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన అటవిశాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన జగనన్న పచ్చతోరణం కార్యక్రమం కింద మొక్కలను నాటారు. అనంతరం డాక్టర్ నళినిపద్మ కేక్ కట్ చేశారు.జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. లింగసముద్రంలో వైఎస్ విగ్రహానికి వైసిపి నాయకుల నివాళి అర్పించారు. అనంతరం వైద్యశాలల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఎంపిపి పెన్నా కృష్ణయ్య, జడ్‌పిటిసి డాక్టర్ చెన్ను నళినిపద్మ, ఎఎంసి వైస్ ఛైర్మన్ ఎం.శ్రీనివాసులు, తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఓ చద్రసేన్, కావలి అటవి శాఖ అధికారులు ఐ. మోహన్ రావు, కమ్మిశెట్టి సురేష్,మండల వైసిపి కన్వీనర్ పి. తిరుపతిరెడ్డి, వైసిపి మండల అధికార ప్రతినిధి వి.క్రిష్ణారెడ్డి,వైసిపి నాయకలు డాక్టర్ చెన్ను ప్రసాద్,కె.క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉలవపాడు : ఉలవపాడులో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినోత్సవాన్ని వైసిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.



కందుకూరులో..



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

పొదలకూరు : దేశంలోని శక్తివంతమైన మహిళల్లో నారా బ్రాహ్మణి ఒకరని మండల టిడిపి మహిళా నాయకులు వెంపులూరు అరుణ గౌడ్, ఆదాల సుగుణ, వెంకటరమణమ్మ పేర్కొన్నారు. బుధవారం నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు అరుణ నివాసంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.పట్టణ అధ్యక్షులు మల్లికార్జున్ నాయుడు, బక్కయ్య నాయుడు, జమీర్ ,దేవినేని శరత్, మదిరిళ్ళ.నరసింహులు, కలగట్ల.సందీప్, జహీర్, గణేష్,పిన్నెం .ప్రభాకర్, శ్రీనివాసులు యాదవ్ ,నారప నాయుడు, పెంచలయ్య కొండమ్మ, ఆశీర్వాదం,మస్తాన్,ఖాదర్ బాషా, హరినారాయణ,రోహిత్ పాల్గొన్నారు.

కందుకూరు : నారా బ్రహ్మణి పుట్టినరోజు సందర్భంగా కందుకూరులోని పార్టీ కార్యాలయంలో మహిళా నేతలతో కలిసి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : విద్యుత్ సంస్థలో 15,20 ఏళ్ల నుంచి నుంచి కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న 25 వేల మందికి పైగా ఉన్న కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు అధ్యక్ష, కార్య దర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బాలాజీనగర్‌లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా 3వ మహాసభ నిర్వహించారు.ఈ మహాసభలకు సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కె అజయ్‌కుమార్

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం నూతన కమిటిని ఏన్నిక చేశారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.కృష్ణ, బాజ్జ సుమన్, కోశాధికారిగా నాగరాజు, ఆఫీస్ బేరర్స్‌గా ఆరిఫ్, సుబ్రహ్మణ్యం, మహేష్, రాజమోహన్, శ్రీనివాసులు, కమిటీ సభ్యులుగా సునీల్, బి.శ్రీనివాసులు, ఆసిప్,నాంచరయ్య, వెంకటేశ్వర్లు, మస్తాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి : టిడిపి

నెల్లూరు : కరోనా కేసులు నమోదయ్యే అవకాశముందనికేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ అబ్దుల్ అజీజ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

జెడ్‌పి సిఇఒకు సన్మానం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : జెడ్‌పి సిఇఒ, జిల్లా పంచాయతీ అధికారి బి చిరంజీవిని సంబంధిత శాఖ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం, నెల్లూరు మండలం లోని విస్తరణాధికారులు (పి ఆర్ అండ్ ఆర్డిలు, పంచాయతీ కార్యదర్శులు చిరంజీవిని మర్యాద పూర్వకముగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్ల దరఖాస్తులను తిరస్కరించండి

ప్రజాశక్తి - లింగసముద్రం : ఉపాధ్యాయ ఎంఎల్‌సి బోగస్ ఓట్లు ధరాఖాస్తులను తక్షణమే తిరస్కరించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తమశీల్దార్ సుధాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రెండో దశ ఓట్లు చేర్పింపు ధరఖాస్తులు బోగస్ సర్టిఫికేట్లుతో వచ్చాయని, వీటిని నివారించాలని, వచ్చిన ధరఖాస్తులను సమగ్రంగా విచారించి, అర్హత కలిగిన వారికే ఓటు హక్కు కల్పించాలని సిపిఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు, లింగసముద్రం శాఖా కార్యదర్శి సిహెచ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కావలి ఏరియా హాస్పిటల్‌కు "లక్ష్య" అవార్డు

ప్రజాశక్తి-కావలి : 2021-2022 సంవత్సరానికి గానూ కావలి ఏరియా హాస్పిటల్‌కు "లక్ష్య" అవార్డు ఎంపికైంది. ఏరియా హాస్పిటల్‌లో సిబ్బంది పనితీరు, హాస్పిటల్ మెయింటెనెన్స్, డాక్టర్స్ పనితీరు, వాళ్ల పనితీరుని బేస్ చేసుకుని అవార్డు ఇచ్చారు. కలెక్టర్ చక్రధర్‌బాబు ద్వారా కావలి ఏరియా సూపరింటెండెంట్ కె.సుబ్బారావుకి, ఆర్.ఎం.ఒ. ప్రసాద్‌రావుకి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మిత్రులు, శ్రేయోభిలాషులు, హాస్పిటల్, సిబ్బంది, అభిమానులు, సుబ్బారావుకి ప్రసాద్‌కి అభినందనలు తెలియజేశారు.

మొక్కలు నాటడం అభినందనీయం

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గంధం.ప్రసన్నాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు నేలటూరి.శివప్రసాద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సెంటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో సెంటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెడ్మాస్టర్ విమల రూబి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.అజిత్‌బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

పోలీసు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ప్రతిఒక్కరూ పోలీసులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు డిఎస్‌పి కోటారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో అంగన్‌వాడీ, మహిళా పోలీసులు, విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద నుండి బి.ఎస్.ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ రవినాయక్, ఎస్‌ఐలు శివ శంకర్రావు, సాయి ప్రసాద్, సంతోష్ రెడ్డి, నాగార్జున రెడ్డి, పోలీస్ స్టేషన్ల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు గ్రామానికి చెందిన, బిగ్‌బాస్ సీజన్ 6లోకి కంటెస్టెంట్ ఆదిరెడ్డికి బుధవారం గ్రామస్తులు ఘనస్వాగతం తెలియజేశారు. ఈ సందర్భంగా వరికుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, అభిమానుల మధ్య కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పూలు వెదజల్లుతూ ఆయనకు స్వాగతంపలికారు.

డ్రైయిన్లు పరిశీలన

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని స్వాంప్ కాలువ, అలుగువాగు, పిల్లి వాగు, చెంగల్ వాగు, పైడేరు వాగు తదితర డ్రైయిన్లను బుధవారం ఎంపిడిఒ శ్రీదేవి, ఆ శాఖ డిఇ పద్మ, ప్రత్యేక అధికారి మృదుల, ఏఇ జలీల్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మేజర్ కెనాళ్లను పరిశీలించి అందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికాలకు పంపుతామని తెలియజేశారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటలను బుధవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ విధానం గురించి, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ గురించి వివరించారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ దేవి మొక్కజొన్న, మిరప పంటలలో యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎడిఎ జిల్లా వనరుల కేంద్రం మారుతీ దేవి, మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి, ఎఇఒ నారాయణ, వివిఎ నరేంద్ర రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కంపసముద్రంలో జొన్నపంటలో పొలంబడి, క్లస్టర్ డెమో శిక్షణ తరగతులను బుధవారం డిపిడి జి.శివన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏరువాక కేంద్రం కీటక శాస్త్రవేత్త సురేఖదేవి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటలలో రసాయనిక పురుగుమందులను వినియోగించకుండా సహజ పద్ధతులలో నివారించుకోవాలని సూచించారు. డిఆర్‌సి ఎడిఎ మారుతీ దేవి, ఉదయగిరి ఎడిఎ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి అనంతసాగరం : మండలంలోని టిజెఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన విద్యార్థులు బుధవారం మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో విజేతలైన విద్యార్థులకు జెడ్‌పిటిసి రాపూరు వెంకటసుబ్బారెడ్డితో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపిపి సంపూర్ణమ్మ, వైస్‌ఎంపిపి సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ మధు సూదన్‌రావు, జనార్దన్ రెడ్డి, పూర్వ ఎంఇఒ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శులతో డిఎల్‌పిఒ సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలో జరగనున్న సమస్యలపై బుధవారం కావలి డిఎల్‌పిఒ ఆది నారాయణ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హౌస్ ట్యాక్సులను అందరూ 100 శాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో బస్టాండ్ నిర్మాణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు బుధవారం శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంజిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణ పనులను ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ నిర్మాణం మ్యాప్‌ను పరిశీలించి నిర్మాణ కాంట్రాక్టర్‌కు, అధికారులకు పలు సూచనలు అందజేశారు.

వడ్డీరేట్లపై అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆత్మకూర్ బ్రాంచ్ పరిధిలోని ఎఎస్‌పేట కళా జాతాను బుర్రకథ నిర్వహించినట్లు సిఇఒ రమేష్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు వారు అందిస్తున్న రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్లు వివరించారు. ప్రధానంగా పిఎంజెజెవై, పిఎంఎస్‌బివై ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలకు అవగాహన చేశారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలో సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడంలో పారదర్శకత చూపుతున్నట్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కేత వేణుగోపాల్‌రెడ్డి తెలియజేశారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు నువ్వూరు పాడులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడంలో పారదర్శకత చూపుతుందని కొనియాడారు. సర్పంచ్ కటారి దొరసనమ్మ, ఎంపిటిసి గడ్డం సుచిత్ర, తహశీల్దార్ నరసింహరావు, ట్రాన్స్ కో ఇంజనీరు వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీరు నయోమి, కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, వైసిపి నాయకులు శ్రీనివాసులు నాయుడు, వేణు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం బాల కొల్లా మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 29న కావలికి విచ్చేయనున్న సందర్భంగా మండలంలోని నాయకులతో కార్యకర్తలతో సమీక్షించారు. మాట్లాడేందుకు టిడిపి నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొని నాయకులతో చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పవనన్న ప్రజాబాట'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయాలన్న దృఢ సంకల్పంతో, ప్రజల ఆశీర్వాదంతో కొనసాగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమం, బుధవారానికి 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆత్మకూరు జనసేన ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, చంద్ర, సురేంద్ర, నాగార్జున, భాను, ఆనంద్, రాజా, హజరత్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కోవూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఇనమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని నిర్వహణాధికారి పి.వనజ కుమారి పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవిబాబు, వారి సిబ్బందితో పాటు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని పలు ఎరువుల దుకాణాలలో కావలి ఎడిఎ కన్యయ్య, విడవలూరు వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య, జలదంకి మండల వ్యవసాయ అధికారిని శైలజా బుధవారం తనిఖీలు నిర్వహించారు. నాణ్యమైన పురుగు మందులను రైతన్నలకు విక్రయించాలని షాపుల యాజమాన్యాలకు సూచించారు.

వేర్వేరు చోట్ల బంగారం చోరీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీ ఖాజీవారిపాలెం వీధిలో ఓ ఇంట్లో 9సవర్ల బంగారం, చెంచులక్ష్మీపురం గ్రామంలో ఓ ఇంట్లో 3 సవర్ల బంగారం రూ.50 వేల నగదు చోరీ గురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌ఛార్జ్ ఎస్‌ఐ సుమన్ వివరాల మేరకు.. చెంచులక్ష్మీపురం, ఖాజీవారిపాలెం వీధుల్లో బంగారం, నగదు చోరీ గురైందని తెలిపారు. సంఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

పలుచోట్ల ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-ఉదయగిరి
ఎన్నడూ లేని విధంగా రాష్ట్రమంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకోవడం శుభ పరిణామమని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక హై స్కూల్ గ్రౌండ్‌లో నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతి కుమారి ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలను 50 కేజీల కేకుతో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అభిమానులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జనం మెచ్చిన జగనన్న పరిపాలన చూసి ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా మన పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. అనంతరం ప్రచార కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ తాను వేసే ముందు అడుగు జగన్మోహన్ రెడ్డి ఘన విజయానికని పేర్కొన్నారు. అందుకు నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు సహకరించి ముఖ్యమంత్రి ఆశించిన 175 సీట్లకు 175 ప్రతి ఒక్కరం సైనికుల పనిచేసి 2024లో కానుకగా అందజేసి ఆయన జన్మదిన మరింతగా ఘనంగా జరుపుకోవాలని ఆమె కోరారు. ముందుగా మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వైసిపి క్యాంప్ కార్యాలయం నుండి హైస్కూల్ గ్రౌండ్ బహిరంగ సభకు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో భారీర్యాలీతో చేరుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినంగా ఏర్పాటు చేసిన బ్లడ్ కాంపౌండ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి మూలె పద్మజ వినయ్‌రెడ్డి, ఎన్‌డిసిసి డైరెక్టర్ ఫీల్జీ సలీం, కొట్టాలపల్లి సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, సుభాన్, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, గౌస్ మొహిద్దీన్, కొల్లిబోయిన కృష్ణ, ఉప సర్పంచ్ ముర్తుజ, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ యస్దాని నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా బుధవారం శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి పంచాయతీ ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ మేకపాటి ఆదేశాలు, ప్రచార కార్యదర్శి శాంతికుమారి సూచనలతో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. పంచాయతీలో పలు వీధుల్లో అన్ని వర్గాలు మహిళలు యువత విద్యార్థుల తల్లిదండ్రులు పండుగ వాతావరణంలా జరుపుకుంటున్నాం న్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో వైసిపి మండల కన్వీనర్ బొర్రా వెంకట సుబ్బారెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి, భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నందవరం ఆదర్శ పాఠశాలలో ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఆత్మకూర్ రేంజ్ సోషల్ ఫారెస్ట్ డిఆర్ఒ సౌజన్య ఆధ్వర్యంలో సర్పంచ్ రామ్మోహన్ ప్రిన్సిపల్ శారదా కుమారి మొక్కలు నాటారు. చిన్నమాచనూరులో సర్పంచ్ కటకం నరసింహారావు, నాయకులు గుంటుపల్లి రమేష్, ఒంగోలు శ్రీనివాసులు రెడ్డి కేక్ కట్ చేయగా, చిలకపాడు సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి, మోహన్ రెడ్డి కేక్ కట్ చేయగా, నందవరంలో నాయకులు ఒంటిది కృష్ణారెడ్డి ఖాదర్ బాషా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోనంకి శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, గంగినేని రవీంద్రబాబు, నారాయణస్వామి, ఎంపిటిసిలు గీత, హజరత్ రెడ్డి, హరితేజ, నారాయణరెడ్డి బూదవాడ వైసిపి నాయకులు ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణాపురం వైసిపి నాయకులు లక్ష్మీరెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మండల పరిషత్ కార్యాలయ అవరణంలో అయ్యవారిపల్లి సర్పంచి చింతనబోయిన దుర్గాప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో, చిననాగంపల్లి గ్రామంలో ఎంపిటిసి దుగ్గిరెడ్డి లక్ష్మీకాంతమ్మ వెంకటరెడ్డి, మాజీ సర్పంచి చెరుకుపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమాలలో మాజీ కన్వీనర్ పానెం రమణయ్య, మాజీ ఎంపిపి ఎన్.అబ్రహం, మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరుపతయ్య, నాయకులు పొట్టి రామచంద్రయ్య, రామ్మోహన్ రెడ్డి, రేనాటి రమణయ్య, మేరం రామయ్య, మాచిరాజు వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా బుధవారం ఎంపిపి కుమారి దర్శిగుంట శశిరేఖ కార్యాలయంలో టెంకాయ చెట్టును నాటారు. తదుపరి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అలాగే నార్త్ ఆములూరు గ్రామంలో సర్పంచ్ షేక్ కరిముల్లా షా ఖాదర్ ఆధ్వర్యంలో వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీదేవి, మండల ఉపాధ్యక్షుడు గుమ్మడి సురేంద్ర, ఎంపిటిసి రఘు తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని కోవూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలం కుడితిపాలెం గ్రామంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా రూ.17.50 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేశారు. వెంటనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనీ ప్రతి ఇంటి దగ్గర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్రంలోని ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, గ్రామ సర్పంచ్ నాయుడు సురేష్, సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలును మండల అధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సి.శ్రీనివాసులు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.శ్రీనివాసులు నాయుడు, నాయకులు సుదర్శన్, బుచ్చిరెడ్డి, హజరత్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ కంటే అత్యధికంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల సృష్టికర్త అని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని 50 కేజీల భారీ కేక్‌ను అభిమానుల నడుమ ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి కోసి పంచిపెట్టారు. అనంతరం రెడ్‌క్రాస్ భవనం వద్ద రక్తదాన శిబిరాన్ని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అర్హులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి అనంద్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్‌లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, సిటికెట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, చేజర్ల సొసైటీ అధ్యక్షుడు డి వీర రాఘవరెడ్డి, జెడ్‌పిటిసిలు పీర్ల పార్థసారథి, ఎఎస్‌పేట ఎంపిపి బోయిళ్ల పద్మజా రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, చెరుకూరు కామాక్షయ్యనాయుడు, శ్రీనివాసులు నాయుడు, సయ్యద్ జమీర్, వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-జలదంకి : రక్తదానం చేస్తున్న బ్రాహ్మణ క్రాక సర్పంచ్ ఇండ్ల సుధాకర్ వంటేరు యువసేన ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదటిగా వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావలి మాజీ ఎంఎల్‌ఎ వంటేరు వేణుగోపాలరెడ్డి ఆదేశాలతో ఆయన అభిమానులు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో భారీగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో విఆర్ఒ బాలకోటయ్య, పంచాయతీ కార్యదర్శి నీరజ, వంటేరు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్ రావు ఆధ్వర్యంలో బి.ఆర్ కంపెనీలో రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిఎంఆర్ కంపెనీలో పనిచేస్తున్న స్టాఫ్, బిఎంఆర్ అభిమానులు పాల్గొన్నట్లు మేనేజ్మెంట్ డైరెక్టర్ బ్రైట్ మేనేజ్మెంట్ గ్రూప్ మద్దిబోయిన శేషాద్రి యాదవ్ తెలిపారు.



ఎరువుల నిర్వహణపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు : కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయ కర్త డాక్టర్ జి.లలితశివజ్యోతి ఆధ్వర్యంలో వానపాముల ఎరువు, వర్మీవాష్ తయారీపై బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇన్‌ఛార్జి పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమానికి వచ్చిన రైతులకు వానపాముల ఎరువు, వర్మీవాష్ తయారీ పైన శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం ఎడిపిఎమ్ సి.హెచ్. రవిచంద్రప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని సేంద్రీయ వ్యవసాయంలో వానపాముల ఎరువు ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో దాదాపుగా 30 మంది రైతులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత



ప్రజాశక్తి-సీతారామపురం
సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానిపాధ్యాయుడిగా పనిచేస్తూ అకాల మరణం చెందిన కొడవటి కంటి సుందరం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కొడవటికంటి సుందరం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సీతారామపురం పంచాయతీ పరిధిలోని పండ్రంగి గ్రామంలో ఉన్న ఎస్‌టి కుటుంబాలకు ట్రస్ట్ అధినేత సర్పంచ్ కొడవటి కంటి భాగ్యమ్మ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి, పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తూనే తమ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో పేదలకు సహాయం చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో తమట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మాజీ సైనికుల కుటుంబాలకు పరామర్శ



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మాజీ సైనిక కుటుంబాలు ఏనుగుల సహదేవరెడ్డి ఆయన సోదరుడు ఏనుగుల సుధీర్ రెడ్డి మృతి చెందగా వారి కుటుంబాలను బుధవారం మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవకు అంకితమైన డానియల్ రెడ్డిలో ఆర్మీలో పనిచేసి పని చేయడమే కాకుండా తన కుమారులను దేశ సైన్యంలో చేర్చడం అభినందనీయమని తెలిపారు. వారిద్దరి కుమారుల అకాల మరణం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బొడ్డు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్థిక సమస్యలతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య వ్యవస్థలో అమ్మఒడి వంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, ప్రతి పేదబిడ్డ చదువుకు ముఖ్యమంత్రి అండగా నిలిచారన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. అలాగే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను సులభంగా అందించాలనే లక్ష్యంతో బైజుస్ కంటెంట్‌తో రూపొందించిన ట్యాబ్‌లను ఉచితంగా అందించేందుకు సిఎం శ్రీకారం చుట్టారన్నారు. ప్రతిఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నతంగా రాణించాలని మంత్రి ఆకాంక్షించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం శుభ పరిణామన్నారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు మొదటి విడతలో 1059 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రెండో విడతలో 1370 పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఫిబ్రవరిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో 20869 మంది 8వ తరగతి విద్యార్థులకు, 2880 మంది ఉపాధ్యాయులకు బైజుస్ కంటెంట్‌తో రూపొందించిన ట్యాబ్‌లను వారం రోజుల్లోగా అందజేస్తామన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ అన్ని రంగాల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే భూమి, ఇల్లు వంటి ఆస్తి శాశ్వతంగా ఉండకపోవచ్చు కానీ జగనన్న అందించే విద్య మాత్రం శాశ్వతంగా తోడుగా ఉంటుందన్నారు. ముందుగా కావలి జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో సిఎం జన్మదిన సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్, రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి, క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వికె.శీనా నాయక్, జెడ్‌పిటిసి జంపాని రాఘవులు, ఎంపిపి ఆలూరి కొండమ్మ, కావలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, సమగ్ర శిక్ష ఎపిసి ఉషారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, ఉప విద్యాశాఖ అధికారి హరి ప్రసాద్, కావలి డి.ఎల్.డి.ఒ. ఎస్.కనకదుర్గ భవాని, హెచ్ఎం నీరజ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి ట్యాబ్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-వరికుంటపాడు
వరికుంటపాడు సచివాలయ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ విజయ్‌భాస్కరరావు అన్నారు. బుధవారం మండలంలోని కాంచెరువు, తూర్పు బోయమడుగుల గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ ఆకస్మికంగా తరలించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రతిరోజు స్పందన కార్యక్రమానికి సిబ్బంది అందరూ తప్పక హాజరు కావాలని, ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా కొడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. కాంచన సచివాలయంలో విధుల్లో లేని ఎఎన్ఎం, ఎహెచ్‌లు విధుల్లో లేకపోవడంతో వారికి మెమోలు అందజేస్తునట్లు తెలిపారు. అనుమతులు లేకుండా సెలవులు తీసుకున్న వారిపై ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, మౌలాలి, పుష్ప, ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ సహాయకులు రామకృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో సుస్మిత ప్రతిభ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన జిల్లాస్థాయి వ్రక్తుత్వ, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న ఎఎస్‌పేట జెడ్‌పి పాఠశాల విద్యార్థిని గడ్డం సుస్మిత 10వ తరగతి జిల్లా స్థాయిలో నిర్వహించిన రెండు విభాగాల పోటీలలో ప్రథమ స్థానం దక్కించుకుంది. కలెక్టర్ చేతుల మీదుగా రూ.6వేల నగదు బహుమతిగా అందుకుంది. ఈ మేరకు బుధవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ హమీద్ ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో ఆ సుస్మితను అభినందించారు. అలాగే పాఠశాల తరపున ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ ప్రతిభ పోటీలలో పాల్గొనేందుకు ఆ విద్యార్థినిని ప్రోత్సహించిన పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ ఆజాద్, వై.హరికృష్ణ, విద్యార్థిని తండ్రి సురేష్‌లను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర విభాగాల్లో కూడా బాగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-బిట్రగుంట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం విశ్వనాధరావు పేట నాయకులు గండూరి శ్రీనివాసులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి నియోజకవర్గ పరిశీలకులు, కదిరి బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఈతముక్కల చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేమి ఖర్మ మనరాష్ట్రానికి'

ప్రజాశక్తి-ఇందుకూరుపేట
గత ప్రభుత్వాలు దళిత, గిరిజనులకు సబ్‌ప్లాన్ ద్వారా నిధులు మంజూరు చేస్తే వారు దుర్వినియోగం చేశారని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పందంగా ఉందని టిడిపి కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఖండించారు. బుధవారం గంగపట్నం పంచాయతీలోని పలు గ్రామాలలో ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రావేళ్ల వీరేంద్ర చౌదరి, నెల్లూరు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, సీనియర్ టిడిపి నాయకులు కొండూరు సుధాకర్ రెడ్డి, గుండాల కృష్ణారెడ్డి, మునగాల రంగారావు, జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ నిధులు దోపిడీ

ప్రజాశక్తి-అల్లూరు : గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సబ్సిడీతో అనేక రుణాలు మంజూరు చేశారని కాగా వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి వాటన్నింటిని పక్కదారి పట్టించి అంతా దోచుకున్నారని టిడిపి నాయకులు బీద గిరిధర్ ఆరోపించారు. బుధవారం మండలంలోని ఇందుపూరు గిరిజన కాలనీలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేని కాలంలో గిరిజనులు వేటకు వెళ్లేందుకు సైకిళ్లు, వలలు ఇతర సామాగ్రిని అందించే వారిని కానీ నేడు బటన్ల మాయాజాలంతో వారి కోసం రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను హరించి వేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్న సమయంలో క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా రేషన్ షాపులలో అందించే వారిని గుర్తు చేశారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం తప్ప చక్కెర కూడా ఇవ్వటం లేదని పండగ పూట తీపి చేసుకునేందుకు విలవిలలాడిపోతున్నారని ఆరోపించారు. వైసిపి చేసే అరాచకాలపై ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటనూనె నుండి పెట్రోల్, డీజిల్ వరకు అడ్డు అదుపు లేకుండా విపరీతంగా ధరలు పెంచుకుపోతున్నారన్నారు. పూర్వ వైభవం రావాలంటే తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వారి సమస్యలను తెలుసుకొని మొబైల్ ఫోన్ ద్వారా మిస్డ్ కాల్ చేస్తున్నారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, అంబటి రాజేంద్ర, కావలి జగన్ మోహన్‌రావు, చెంతాటి రాజశేఖర్‌బాబు తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : పట్టణంలోని 15వ వార్డు పరిధిలో టిడిపి నాయకులు బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చంద్ర వెంకటసుబ్బానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఎం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి పోరాటాలకు ప్రజలు అండగా ఉండాలని 9261292612 ఫోన్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి టౌన్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మొగల్ ఎస్దాని, జిల్లా మాజీ తెలుగు ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు శ్రీకాంత్ నారాయణ, నరేష్, పెంచలయ్య, వెంకటయ్య సునీల్, ప్రసాద్ సుధాకర్, కృష్ణ, పవన్, మోహన్ మహేష్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి : 9 రోజులుగా జరుగుతున్న అభ్యసన అభివృద్ధి శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. గండిపాలెం గురుకుల పాఠశాలలో జరగనున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ ట్రైనింగ్ కోర్స్ డైరెక్టర్ షేక్ మస్తాన్‌వలీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కో-కోర్స్ డైరెక్టర్ జెడ్‌పిపాఠశాల వెంగళరావునగర్ ప్రధానోపాధ్యాయులు షేక్ నూర్జహాన్, మండలా ల 44 మంది ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, రిసోర్స్ పర్సన్‌లు సిహెచ్ శ్రీనివాసులు, కె వెంకటరమణ పాల్గొన్నారు.

పిఎన్ఎం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు ప్రజానాట్యమండలి నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొలుత గ్రామ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి గండవరపు శీనయ్య, జిల్లా అధ్యక్షుడు రత్నయ్య, జిల్లా కార్యదర్శి పి.విజయకుమార్, పాల్గొన్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కన్నయ్య, ఎస్‌కెబాబు, ఉపాధ్యక్షులుగా రమణమ్మ, క్రిష్ణ, సహాయకార్యదర్శులుగా విజయమ్మ, నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా రత్తయ్య, సభ్యులుగా మరో 8మందిని ఎన్నుకున్నారు.